# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విశాఖపట్నంలో నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.**

2. **ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహకారం అందించాలని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.**

3. **రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఈ ఉదయం అమరావతి నుంచి విశాఖపట్నానికి బయలుదేరతారు. విశాఖ చేరుకున్న అనంతరం ఆర్‌కే బీచ్‌లో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు, స్థానిక మత్స్యకారులతో ముఖ్యమంత్రి ముచ్చటించనున్నారు. అనంతరం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. విశాఖపట్నంలోని 11 మండలాల పరిధిలోని లబ్దిదారులకు ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలు అందిస్తారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ముగించుకుని విశాఖ నుంచి అమరావతికి ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణమవుతారు.

------------------------

రాజధాని అమరావతి పరిధిలో ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ, గుంటూరు సహా సమీప ప్రాంతాలను అనుసంధానిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న జరిగిన 66వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ - సీఆర్‌డీఏ సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. రాజధానిలో నూతనంగా నిర్మించనున్న అసెంబ్లీ భవనంపై 250 మీటర్ల ఎత్తైన స్పియర్

టవర్‌తో పాటు లిఫ్టుల నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ నిర్మాణాలకు 661 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేశారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో ఎల్.పి.ఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఒక వెయ్యి 548 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ అనుమతి ఇచ్చింది.

---------------------------

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు శివరాజ్‌సింగ్ చౌహాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను నిన్న కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహకారాన్ని కోరుతూ వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

---------------------------

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈగల్ ప్రస్తుత పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఈగల్ కేంద్ర కార్యాలయంలో నిన్న నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో హోంమంత్రి పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ఈగల్ వ్యవస్థ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపడుతోందన్నారు. గత 21 నెలల్లో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును గణనీయంగా తగ్గించామని హోంమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా ఉండి రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులను ఈ ఏడాది నవంబర్ నెల చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఉండి రైల్వే గేట్ వద్ద జరుగుతున్న ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ యువత బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శు క్రవారం నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాలను పెంపొందించుకునే వివరాలు అందుబాటులో ఉండేలా నైపుణ్య

పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశం మంత్రి అధ్యక్షతన గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... గురుకుల పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాలన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించిన వారిలో దాదాపుగా 27 మంది ఐఎఎస్, 20మంది ఐపిఎస్, 13మంది ఐఆర్ఎస్, నలుగురు ఐఎఫ్ఎస్ లుగా, మరెంతో మంది సమాజంలో అత్యున్నత స్థానాల్లో సేవలందిస్తున్నారని అధికారులు మంత్రికి వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, 25 వసంతాల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 10 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గత రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై గజేంద్ర మోక్ష అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీమలయప్పస్వామి వారిని కనులారా దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. దీనిపై ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్...27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ విద్యార్థులకు యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనాలిటీ పరీక్షలకు శిక్షణ కోసం ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ తెలిపింది. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, వచ్చే నెల 1న ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించింది. అక్టోబర్ 2వ తేదీన ఎంపిక జాబితా ప్రకటించనున్నట్లు, 5వ తేదీ నుంచి ఎనిమిది నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తామని పేర్కొంది.

---------------------------

ఉత్తర థాయిలాండ్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈ రోజు సాయంత్రానికి అదే

ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. ఉత్తర అంతర్గత తమిళనాడు దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపారు. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..25.. సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరబాదు వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

---------------------------

మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబరు 21న రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.

=====================